ప్రజాశక్తి
మంగళవారం 17 సెప్టెంబరు, 2024 5
శ్రీకాకుళం



అన్ని ప్రాంతాలకూ ప్రయాణ సౌకర్యం



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రం నుంచి అన్ని ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు వాహనాలను అందుబాటులో ఉండే విధంగా యాజమాన్యం ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యేలు గొండు శంకర్, గౌతు శిరీష పేర్కొన్నారు. సోమవారం నగరంలోని బలగ ప్రాంతంలో ఎన్‌కెవిఎస్ ప్రైవేట్ ఏజెన్సీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అన్ని పర్యాటక ప్రదేశాలకు, ఆధ్యాత్మిక ప్రాంతాలకు, ప్రముఖ నగరాలకు ట్రావెల్ ఏజెన్సీ ద్వారా రవాణా సౌకర్యం కల్పించాలన్నారు.

నూనెలు సలసల

- వంట నూనెలపై దిగుమతి సుంకం 20 శాతం పెంపు
- లీటరుకు రూ.15 నుంచి రూ.25 వరకు పెరుగుదల
- కుటుంబంపై నెలకు రూ.వందకు పైగా భారం



ప్రజాశక్తి - శ్రీకాకుళం, ఆమదాలవలస

వంటనూనెల ధరలు సలసల కాగుతున్నాయి. వంటనూనెల దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం 20 శాతం సుంకం పెంపుతో సామాన్యులపై పెనుభారం పడే పరిస్థితి ఏర్పడింది. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పప్పులు మొదలు పెట్రోలు వరకు ఈ పదేళ్లలో అన్ని ధరలూ విపరీతంగా పెరిగాయి. ఇక నిత్యావసర సరుకుల ధరల పరిస్థితి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. వంటనూనెల ధరలు లీటరు రూ.180 వరకు పెరిగాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో దిగుమతి సుంకం తగ్గించడంతో నూనెల ధరలు కొంతమేర తగ్గాయి. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో మళ్లీ మోడీ సర్కార్ దిగుమతి సుంకాన్ని ఐదు నుంచి 20 శాతానికి పెంచింది. దీంతో వంటనూనెల ధరలు మార్కెట్లో విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం లీటర్ పామాయిల్ నూనె ధర వంద నుంచి రూ.120కు, సన్‌ఫ్లవర్ లీటరు రూ.115 నుంచి రూ.135, వేరుశనగ లీటరు రూ.155 నుంచి రూ.170 ఇలా ప్రతి వంటనూనెపై రూ.15 నుంచి రూ.25 వరకూ ధరలు పెరిగాయి. దిగుమతి సుంకం పెంచిన వెంటనే పాత స్టాక్ ధరలు పెంచి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. పెరిగిన వంటనూనెల ధరలు చూసి సామాన్య ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో 27 లక్షల జనాభా ఉండగా, సుమారు తొమ్మిది లక్షల కుటుంబాలు ఉన్నాయి. ప్రతి కుటుంబం నెలకు తక్కువగా లెక్కించినా నాలుగు లీటర్ల నూనె పాకెట్లను ఉపయోగిస్తారు. పెరిగిన ధరలతో ఒక్కో కుటుంబంపై నెలకు రూ.వంద వరకూ భారం పడనుంది. ఎక్కువగా ఉపయోగించే కుటుంబాలకు ఈ భారం మరింత పెరగనుంది. గడిచిన ఎన్నికల్లో ధరల పెరుగుదల తీవ్ర ప్రభావం చూపింది. వంటగ్యాస్, కందిపప్పు, మినపపప్పు, పెసరపప్పు, వంటనూనెల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై జనం నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఈ ప్రభావం కారణంగా మోడీ ప్రభుత్వం గడిచిన ఎన్నికల్లో అత్తెసరు సీట్లతో బయటపడింది. ధరల పెరుగుదల రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం సైతం కదిపేసింది. విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీలు పెంపుతో పాటు కేంద్రం పరిధిలోని పప్పులు, ముడిచమురు ధరల పెరుగుదల ప్రభావం వైసిపిని వెంటాడింది. దీంతో రాష్ట్ర ప్రజలు మే 13న జరిగిన ఎన్నికల్లో వైసిపిని చిత్తుగా ఓడించిన పరిస్థితి తెలిసిందే.

వెంటనే ధరల పెంపు

వంటనూనెల దిగుమతుల సుంకం పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించడంతో వ్యాపారులు వెంటనే ధరలు పెంచేశారు. ఇప్పటికే దుకాణాలు, గోదాముల్లో నిల్వ ఉన్న వాటిని పాత ధరలకు కాకుండా కొత్త ధరలకే విక్రయిస్తున్నారు. వంట నూనె ధరలు పెరుగుతాయన్న సమాచారంతో నూనె కంపెనీలు మూడు రోజులుగా పంపిణీని నిలిపివేశాయని వ్యాపారులు చెప్పున్నారు. అదే కారణంగా కొందరు వ్యాపారులు కూడా నూనె విక్రయాలను తగ్గించారు. పాత సరుకు ఉన్నా వాటిని విక్రయించకపోవడం, విక్రయించిన వాటిని ధరలు పెంచడం చేశారు. ధరలు ఇంకా పెరిగే అవకాశముంటుందని కొందరు ట్రేడర్లు విక్రయాలను నిలుపుదల చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలువురు ట్రేడర్లు రెండు, మూడు లారీల వంటనూనెలు లోడులను నిల్వ చేసి ఉంచినట్లు తెలుస్తోంది. అధికారులు జోక్యం చేసుకుని ఇప్పటివరకు ఉన్న స్టాకును పాత ధరలకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కేంద్రమంత్రికి చెక్కును అందజేస్తున్న మాజీ సైనికోద్యోగులు

మాజీ సైనికుల సేవలు స్ఫూర్తిదాయకం

కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సైనిక ఉద్యోగంలో భాగంగా దేశ సేవలో ఉన్నా.. విరమణ అనంతరం సామాజిక సేవలో ఉన్నా.. వారి సేవలు స్ఫూర్తిదాయకమని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కొనియాడారు. సామాజిక బాధ్యతగా వారు చేస్తున్న సేవలను అభినందించారు. జిల్లాకు చెందిన మాజీ సైనిక ఉద్యోగ సంఘాల సభ్యులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం సిఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.5,00,116 విరాళాలను సేకరించారు. ఇందుకు సంబంధించిన చెక్కు నగరంలోని కేంద్ర మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కష్ట సమయాల్లో ఇలా తమవంతు సాయం చేయడం ఆదర్శం, అభినందనీయమన్నారు. ఎన్నికల ముందు తనను ఓ కుటుంబ సభ్యునిగా భావించి ఎంతో ఆదరించారని.. కేంద్ర మంత్రిగా నియామకమైనా, ఎప్పుడూ ఫోన్ కాల్ దూరంలోనే అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

కేంద్రీయ విద్యాలయం నా బాధ్యత

జిల్లాలోని సైనికులు, వారి కుటుంబాలకు అండగా నిలిచేందుకే ఎర్రన్న జవాన్ మిత్ర, జవాన్ డిక్లరేషన్ కార్యక్రమాలను చేపట్టినట్లు గుర్తు చేశారు. తన అనుభవం, చొరవతో రాష్ట్రంలో ఒక్కో సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చక్కదిద్దుకుంటూ వస్తున్నారని చెప్పారు. మాజీ సైనిక ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసే విధంగా సిఎంతో మాట్లాడుతానన్నారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం తీసుకొచ్చే పూర్తి బాధ్యత తనదేనని పునరుద్ఘాటించారు. ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక కోటా సాధనతో పాటు జిల్లాలో సైనిక అమరవీరుల స్మారక స్థూపం ఏర్పాటు చేసే విధంగా కలెక్టర్‌తో చర్చిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మాజీ సైనికోద్యోగుల సంఘం చైర్మన్ పి.ఈశ్వరరావు, అధ్యక్షులు కె.పూర్ణచంద్రరావు, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛతాహి సేవ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 17 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు జిల్లాలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో స్వచ్ఛతాహి సేవ పోస్టర్లను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యాసంస్థలు ఈ కారక్రమంలో పెద్దఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం, శ్రమదానం ద్వారా వ్యర్థ పదార్థాల తొలగింపు కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్, పంచాయతీ అధికారులు, కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎక్కువగా చెత్త పోగయ్యే బ్లాక్ స్పాట్స్ గుర్తించాలని, పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పర్యాటక ప్రదేశాలు వంటి చోట్ల సామూహిక స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం నియోజకవర్గానికి డ్రోన్ చొప్పున కేటాయిస్తున్నట్లు తెలిపారు. వీటిద్వారా పారిశుధ్య నిర్వహణ అత్యవసరమైన ప్రదేశాలను సులభంగా గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ సిఇఒ ఆర్.వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నేడు డీవార్మింగ్ డే

శ్రీకాకుళం అర్బన్: నులిపురుగులను నివారించే లక్ష్యంతో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు. జాతీయ డీవార్మింగ్ డే సందర్భంగా సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం పాఠశాల ఆరోగ్య పథకంలో భాగంగా మంగళవారం డీ వార్మింగ్ డే నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు (ఆల్బెండజోల్ - 400 మీ.గ్రా) నమిలి తినిపించనున్నట్లు చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఒకటి నుంచి రెండేళ్ల వరకు అర మాత్ర, 2 నుంచి 19 ఏళ్ల వరకు ఒక మాత్ర చొప్పున పాఠశాలలకు వెళ్లని పిల్లలకు అంగన్వాడీ కార్యకర్తల ద్వారా ఈ మాత్రలు వేయించనున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలను వయసుకు తగ్గ మోతాదు బట్టి నమిలి తినిపించాలన్నారు. ప్రతి పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం తర్వాత ప్రతి విద్యార్థికి మోతాదు ప్రకారం నమిలి మింగిస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల పర్యవేక్షణలో అన్ని పాఠశాలలకు మాత్రలు పంపిణీకి సిద్ధం చేశామన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, పాల్గొన్న సిబ్బంది

కోర్టు కానిస్టేబుళ్ల విధులు కీలకం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేసుల పరిష్కారం, శిక్షలు పడేందుకు కోర్టు కానిస్టేబుల్ విధులు చాలా కీలకమని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. జిల్లాలోని పలు పోలీస స్టేషన్లలో పనిచేస్తున్న కోర్టు కానిస్టేబుళ్లు, పలు కోర్టుల్లో సమన్వయ అధికారులుగా పనిచేస్తున్న కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సిబ్బందితో జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు నుంచి అభియోగ పత్రాల దాఖల వరకు కేసుకు సంబంధించి ప్రతి అంశాన్నీ సిసిటిఎన్ఎస్ అప్లికేషన్‌లో పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. నెల వారీగా కోర్టులు జారీ చేసిన సమన్లు, వారెంట్లను పోలీస్‌స్టేషన్ ప్రాసెస్ రిజిస్టర్‌లో నమోదు చేసి, రికార్డు నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం చేసుకుంటూ శిక్షల శాతం పెరిగేలా కృషి చేయాలని సూచించారు. కోర్టుల్లో దాఖలైన అభియోగ పత్రాలను న్యాయస్థానాలకు దాఖలు చేసిన సమయంలో కేసు రికార్డును క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన పత్రాలను సమర్పించే ముందు ప్రతి విషయాన్నీ సంబంధిత పోలీసు అధికారుల దృష్టిలో పెట్టాలన్నారు. అభియోగ పత్రాలను కోర్టుల్లో దాఖలు చేయాలన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ త్వరితగతిన ప్రారంభమయ్యే విధంగా చూడాలన్నారు. శిక్షలు పడేందుకు అవకాశమున్న కేసుల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో మాట్లాడి సక్రమంగా పూర్తయ్యే విధంగా, సాక్షులు సాక్ష్యం చెప్పేందుకు బ్రీఫింగ్ ఇప్పించాలన్నారు. కేసు ప్రాపర్టీ సకాలంలో ప్రవేశపెట్టి, నిందితులకు శిక్షలు పడేలా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో కోర్టు కానిస్టేబుళ్లు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రాధాన్యతా కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కేసు విచారణ త్వరితగతిన పూర్తయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. కోర్టుల్లో అభియోగ పత్రాలు దాఖలు చేసినా కోర్టు రిటర్న్ చేస్తే, ఆ కేసుల వివరాలు, సరైన పత్రాలు సమర్పించి మళ్లీ కోర్టులో దాఖలు చేయాలన్నారు. ప్రతిరోజూ కోర్టులో జరిగే సాక్షులు విచారణ, అభియోగ పత్రాల దాఖలు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్ల జారీ తదితర అంశాలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టిలో పెట్టాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో సిఎంఎస్ ఎస్‌ఐ పారినాయుడు, డిసిఆర్‌బి ఎస్‌ఐ నేతాజీ, పలు పోలీస్‌స్టేషన్ల కోర్టు కానిస్టేబుళ్లు, సిఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

2న ఎండిఎం రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై వేధింపులు పెరిగాయని, అనేకచోట్ల రాజకీయ కారణాలతో అక్రమంగా తొలగిస్తున్నారని మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర తెలిపారు. వేధింపులు, తొలగింపులు ఆపాలని అక్టోబరు రెండో తేదీన విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తరహాలోనే మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై వేధింపులు సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పథకం ప్రారంభం నుంచి పాతికేళ్లుగా పనిచేస్తున్న కార్మికులను అధికార పార్టీ నాయకులు రాజకీయ వేధింపులకు గురిచేసి తొలగిస్తున్నారని విమర్శించారు. కార్మికులను మానసికంగా వేధిస్తున్నారని చెప్పారు. ఈ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 వేల మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారని, వీరిలో ఎక్కువ శాతం ఒంటరి మహిళలే ఉన్నారని తెలిపారు. వీరి ఉపాధికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మరోవైపు పనిలో అగ్ని ప్రమాదాలకు గురైన సంఘటనలున్నా, ఎలాంటి ప్రమాద బీమా సౌకర్యం లేదన్నారు. పథకం అమలుకు పాఠశాలల్లో అమలు చేస్తున్న మెనూ ఛార్జీలకు సంబంధం లేకుండా రోజుకో ఐటమ్ వండి వడ్డించాలని చెప్తున్నారని, దీనివల్ల తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు కనీసం రూ.200కు పెంచాలన్నారు. వంట గ్యాస్‌ను ప్రభుత్వం ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యల పరిష్కారానికి ఉద్యమించాల్సిన అవసరముందన్నారు. ఇటీవల మృతి చెందిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘ కోశాధికారి ఎ.రాధ అధ్యక్షత వహించిన సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు టి.సీతమ్మ, వి.లక్ష్మి, ఎన్.గీతాబాల, రాజులమ్మ, కౌసల్య, తులసి, తులసమ్మ, హారతి, ప్రవీణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహాలక్ష్మి


కమిషనర్‌ను కలిసిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు

సర్క్యులేషన్ ప్యాట్రన్ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగర పరిధిలో సర్క్యులేషన్ ప్యాట్రన్ సమస్య ఎక్కువగా ఉందని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబరులో ఆయన్ను డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ టెక్నికల్‌పర్సన్స్ ఆఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎన్.ఎస్.వి ప్రసాద్ ఆధ్వర్యాన మర్యాదపూర్వకంగా కలిశారు. సర్క్యులేషన్ ప్యాట్రన్ సమస్యను కలెక్టర్‌కు వివరించడం ద్వారా వాటికి పరిష్కారం చూపేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారని చెప్పారు. త్వరలో పరిష్కారం చూపేలా కృషి చేస్తానని ఇంజినీర్లకు కమిషనర్ హామీనిచ్చారని తెలిపారు. నగరంలో సుడా కార్యాలయంలో అనుమతుల కోసం పెట్టిన ప్లాన్లకు టి.ఎస్ (టౌన్ సర్వే) రిపోర్టులు కోరుతున్నారని, వీటితోపాటు కౌంటర్ సైన్లు తప్పనిసరి అని చెప్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. టౌన్ సర్వేయర్ టిఎస్ రిపోర్టుపై కౌంటర్ సైన్ తప్పనిసరి చేయడంతో ప్లాన్లు ఆలస్యం అవుతున్నాయని కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఆయన పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని హామీనిచ్చినట్లు ఇంజినీర్లు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఇంజినీర్లు వి.శ్రీనివాసరావు, బాకి సురేష్, వెంకటేష్, సిహెచ్.భద్రం, బి.సత్యనారాయణ, బి.రమేష్, జి.శ్రీనివాసరావు, కిరణ్, రవికుమార్, సందీప్, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం


ఆటలు ఆడుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

క్రీడలతో మానసిక ఒత్తిడికి దూరమవుతామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, ఎంఇఒ కె.పున్నయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్వర్ణోత్సవాలు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా నగరంలోని ప్రభుత్వ బాలికొన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ మేడుకల్లో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పాల్గొని మాట్లాడుతూ విద్యాబోధనలోను, పాఠశాల నిర్వహణలోనూ ఏర్పడుతున్న మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం క్రీడల వల్లే సాధ్యమన్నారు. శారీరిక, మానసిక సామర్థ్యాల అభివృద్ధికి, ఆరోగ్యవంతమైన జీవితానికి ఆనందంగా గడపాలన్నారు. అందుకోసం ఉపాధ్యాయులు కొంత సమయం క్రీడలకు కేటాయించాలన్నారు. చెస్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్, షాట్‌పుట్, షటిల్ బ్యాడ్మింటన్, ముగ్గుల పోటీలు తదితర ఆటల్లో పాల్గొన్నారు. ఈ పోటీలకు ఫిజికల్ డైరెక్టర్లు అరుణ, స్వాతి, యశోదలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎం.వాగ్దేవి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లండ బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కమిటీ సభ్యులు చౌదరి రవీంద్ర, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.నారాయణరావు, జిల్లా నాయకులు పి.వసుంధరాదేవి, శాంతిప్రియ, సుబ్బలక్ష్మి, రమణికుమారి, ప్రభావతి, ఆర్‌యుపిపి రాష్ట్ర నాయకులు కె.పద్మావతి పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరులో శనివారం ప్రారంభమైన 36వ రాష్ట్రస్థాయి బాల బాలికల టెన్నికాయిట్ క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. గత రెండు రోజులుగా హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి ఎన్.గౌతమ్ సంజయ్ (తూర్పుగోదావరి) ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచాడు. ద్వితీయ స్థానంలో ఎస్.సాయికుమార్ (విజయనగరం), తృతీయ స్థానంలో కె.ఎస్ శంకప్రసాద్ (తూర్పుగోదావరి), వరుసగా 4,5,6 స్థానాల్లో జి.మహిధర్ (అనంతపురం), బి.సత్యనారాయణ (తూర్పుగోదావరి), డి.రోహిత్(విశాఖపట్నం) జిల్లాకు చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. అలాగే బాలికలు విభాగం నుంచి ప్రథమ స్థానంలో కె.జ్యోతిక (అనంతపురం), ద్వితీయ స్థానంలో హెచ్.దీక్షిత (అనంతపురం), తృతీయ స్థానంలో హెచ్.స్పందన (అనంతపురం), వరుసగా 4,5,6 స్థానాల్లో ఆర్.సాంస్కృతి (పశ్చిమగోదావరి), కె.ఇందు (విజయనగరం), బి.గాయత్రి (చిత్తూరు) జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. జమ్ముకాశ్మీర్‌లో ఈ నెల 30 నుంచి అక్టోబరు 4 వరకు జరగనున్న జాతీయ టెన్నికాయిట్ పోటీలకు ఎన్నికైనట్లు క్రీడా నిర్వహకులు పైల గజేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర వండా తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎన్నికైన విజేతలకు (బాలిక)లకు అనకాపల్లిలో, బాలురకు తూర్పుగోదావరి మండపేటలో శిక్షణ పొందుతారని వారు తెలిపారు. కాగా విజేతలకు అధికారులు, పలువురు నాయకులు చేతులు మీదగా బహుమతులు, ప్రశంసపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సూరాడ మోహనరావు, ఎన్.సూర్యానారాయణ, ఎ.ఉమామహేశ్వరరావు, జిల్లా వినియోగదారుల సంఘ అధ్యక్షులు ఎల్.వి చలం, పి.తవిటయ్య, పి.సుందరరావు, కె.కృష్ణారావు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలు అందుకున్న క్రీడాకారులు

అగ్ని ప్రమాదం కుట్రే

- పార్టీ ఆస్తులకు నష్టం కలిగిస్తే చర్యలు
- డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు

శ్రీకాకుళం: ఇందిరా విజ్ఞాన్ భవన్ (కాంగ్రెస్ పార్టీ కార్యాలయం)లో ఈనెల 7వ తేదీన సంభవించిన అగ్ని ప్రమాదం కుట్రగానే అనుమానిస్తున్నామని డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆస్తులకు ఎవరైనా నష్టం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అగ్ని ప్రమాదం విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడాలని అనుకున్నామన్నారు. వారం రోజులుగా పత్రికల్లో వస్తున్న కథనాలతో ఇందులో కుట్ర కోణం ఉందన్న అనుమానం కలుగుతోందన్నారు. ఈ వ్యవహారం రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారడంతో తాను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఎఐసిసి నాయకులు రాకేష్ రెడ్డి పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాజశేఖర్ రెడ్డి, షర్మిలా రెడ్డి అంటూ ఏకవచనంతో మాట్లాడడం సబబు కాదన్నారు. డిసిసి అధ్యక్షుడినైన తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా డిసిసి మాజీ అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా రాష్ట్ర, జిల్లాస్థాయి కమిటీల్లో మార్పులు చేశారని తెలిపారు. డిసిసి అధ్యక్షునిగా తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తానన్నారు. త్వరలోనే మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజల సమస్యలపై పోరాటం చేసేలా కమిటీలను సిద్ధం చేస్తామన్నారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఎల్.వి.ఎన్ ఈశ్వరి, పట్టణాధ్యక్షులు రెల్ల సురేష్, కాంగ్రెస్ నాయకులు అంబటి దాలినాయుడు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు కృష్ణారావు

గంజాయి పట్టివేత

కంచిలి : ఒడిశా రాష్ట్ర కోదలరాం పల్లి సమీపం నుంచి ముంబాయికి తరలిస్తు న్న సుమారు 18 కిలోల గంజాయిని సోమవారం పట్టుకున్నామని ఎఎస్‌పి పి.శ్రీనివాసరావు, సోంపేట సిఐ మంగరాజు, ఎస్‌ఐ జి.రాజేష్ తెలిపారు. ఈ మరకు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంతోష్ కుమార్ సాహూ గంజాయిని పట్టుకుని సోంపేట రైల్వే స్టేషన్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్నారని చెప్పారు. గస్తీలో ఉన్న ఎస్‌ఐ రాజేష్, సిబ్బంది అతడిని తనిఖీ చేయడంతో 18.190 కిలోల గంజాయి పట్టుబడింద న్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, సంతోష్ కుమార్ సాహుని అదుపులోకి తీసుకున్నామని అన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - పలాస

కేంద్రంలో రెండు కోట్లు ఉద్యోగాలు కల్పిస్తానని, పక్కా ఇళ్లు, రైతుకు మద్దతు ధరను చట్టబద్ధం చేస్తానని, మహిళా రిజర్వేషన్లు పార్లమెంట్‌లో ఆమోదించి ఆచరణలో అమలు చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎఐకెఎం జిల్లా రాష్ట్ర నాయకులు తామాడ సన్యాసిరావు, జిల్లా నాయకులు మద్దిల రామారావు అన్నారు. కాశీబుగ్గ బస్టాండ్‌లో అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం, ఎఐకెఎం ఆధ్వర్యాన సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులందరికీ ఉపాధి హామీ జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలన్నారు. ఉపాధి పనులను వ్యవసాయ పనులతో అనుసంధానం చేయాలన్నారు. అలాగే ఉచిత గ్యాస్ పథకాలను అమలు చేయాలన్నారు. పెట్రోల్, డిజిల్, నిత్యవసర సరుకులు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సాగు, తాగునీరు ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలన్నారు. జీడి, కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. బోర్డులు, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సోంపేట, ఇచ్ఛాపురం, మందస, పలాస, వజ్రపుకొత్తూరు, కవిటి మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని కోరారు. ఎఐసిసిటియు నాయకులు దున్న శ్రీనివాస్, నాగేశ్వరరావు, పి.కామేశ్వరరావు కె.దుష్యంత్, లోకనాథం, కె. ఈశ్వరరావు, సుందరమ్మ, దాలమ్మ, వరలక్ష్మి, జయసుధ, నారాయణ పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారి షణ్ముఖరావు

రెడ్‌క్రాస్‌లో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం

శ్రీకాకుళం అర్బన్ : ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల వంటి ఘటనల్లో ప్రజలను ప్రాణాపాయ స్థితి నుంచి గట్టెక్కించడానికి వీలుగా ప్రతిఒక్కరు ప్రథమ చికిత్సపై అవగహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు సూచించారు. సోమవారం రెడ్‌క్రాస్ కార్యాలయంలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులకు ప్రథమచికిత్సపై అవగహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ పి. షణ్ముకరావు అగ్ని ప్రమాదాలపై వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రెటరీ బి.మల్లేశ్వరరావు, ఎం.కళ్యాణ్ చక్రవర్తి, ప్రోగ్రాం మేనేజర్ జి.రమణ, బి.చిన్మయరావు, కళ్యాణ్, పి .శ్రీకాంత్, హరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నులిపురుగుల నివారణపై ర్యాలీ

పోలాకి : ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ అన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి ఆధ్వర్యాన సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆల్బెండజోల్- 400 మిల్లీగ్రాముల మాత్రలు అన్ని ప్రభుత్వ ప్రయివేట్, పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు నర్సింగ్, బిఇడి, పాలిటెక్నికల్ కాలేజీలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేస్తామని అన్నారు. ఒకటి నుంచి రెండేళ్ల వయసు గల పిల్లలకు 1/2 మాత్ర ఆల్బెండజోల్, 2-19 సంవత్సరాల వయసు గల పిల్లలకు 1 మాత్ర ఆల్బెండజోల్ 400 మిల్లీ గ్రాములు ఇస్తామని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పోలాకి పరిధిలో 1414 చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల్లో మాత్రల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వివిధ విద్యాసంస్థల్లో 7చ773 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుమప్రియ, శ్రీమంగం శేఖర్‌బాబు, బరాటం లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

నిమజ్జనాలకు పటిష్ట బందోబస్తు

సోంపేట : పటిష్టమైన బందోబస్తు నడుమ గణేష్ నిమజ్జనాలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని బారువా మెరైన్ సిఐ రమేష్ కుమార్ సోమవారం తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇస్తూ ప్రణాళికతో పటిష్టమైన బందోబస్తు నిర్వహించామని పేర్కొన్నారు. ఇచ్ఛాపురం రూరల్ మండలం పెద్దలక్ష్మీపురం నుంచి మందస మండలం టి.గంగువాడ వరకు 36 గ్రామాల్లో ఇప్పటి వరకు 80 గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయించినట్లు తెలిపారు. ముందస్తు జాగ్రత్తల దృష్ట్యా గజ ఈతగాళ్లను అప్రమత్తం చేశామన్నారు. స్టేషన్లలో ఉన్న ప్రమాద రక్షక పరికరాలు, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్‌లను ఉపయోగిస్తూ... మెగా ఫోన్ ద్వారా ముందస్తు అప్రమత్త హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఎటువంటి అపశృతి లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో కమిటీ కార్యనిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువకులు సహకారంతో బందోబస్తు నిర్వహించామని చెప్పారు.

సానావీధిలో అన్నదానం

శ్రీకాకుళం అర్బన్: వినాయక చవితి నవ రాత్రుల్లో భాగంగా నగరంలోని సానావీధిలో హారిక కన్‌స్ట్రక్షన్స్ అధినేత కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్ (హారికా ప్రసాద్) ఆధ్వర్యాన సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఆయన భార్య కరణం శోభారాణి హాజరై అన్న వితరణ చేపట్టారు. కార్యక్రమంలో సానావీధి యూత్ యోగేశ్వరరావు, సద్గుణరావు, తవుడు, విజయ్ కుమార్, టి.తులసీరావు, ఎస్.కె.మున్నా, బి.విజయ్, వి.మధు, చరణ్ కుమార్, దుర్గాప్రసాద్, రామారావు, శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అన్నవితరణ చేస్తున్న హారికా ప్రసాద్ దంపతులు

అంబేద్కర్ గురుకులం.. కొరవడిన ఆశయం



అంబేద్కర్ గురుకులం

- అడుగడుగునా సమస్యలే
- అధికారుల చర్యలు శూన్యం

వెనుకబడిన విద్యార్థులకు ఉత్తమమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ప్రభుత్వాలు ఎంతో ఉన్నత ఆశయంతో నిర్వహిస్తున్న గురుకులాలు నేడు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఆశయం నీరు గారుతుంది.

ప్రజాశక్తి- బూర్జ

మారుమూల గ్రామాల నిరుపేద విద్యార్థులకు సైతం ఉత్తమ విద్యను అందించేందుకు వీలుగా మండలంలోని కొల్లివలసలో అంబేద్కర్ గురుకులాన్ని ఏర్పాటు చేశారు. ఐదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 600 మంది విద్యార్థులు గురుకులంలో విద్యను అభ్యసిస్తున్నారు. అయితే వారికి అత్యుత్తమ బోధనతో పాటు పౌష్టికాహారాన్ని, అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటుంది. అయితే కొల్లివలస అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సమస్యలు విద్యార్థులను వేధిస్తున్నాయి. కనీస సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనునిత్యం సమస్యలు వేధిస్తుంటే తాము విద్యను ఎలా అభ్యసించాలో అర్థం కావడంలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మూలకు చేరిన మరుగుదొడ్డి

మరుగు కోసం పరుగు

మరుగు కోసం పరుగులు తప్పడం లేదని విద్యార్థులు వాపోయారు. గురుకులంలో మరుగుదొడ్లు, స్నానపు గదులు సుమారు 40 వరకు ఉన్నప్పటికీ అందులో కనీస సదుపాయాలు లేకపోవడం వలన అవస్థలు తప్పడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. స్నానపు గదుల్లో, మరుగు దొడ్లలో నీరు రాకపోవడం, బకెట్లు, జగ్గులు వంటివి కూడా లేకపోవడంతో ఎలా కాలకృత్యాలు తీర్చుకోవాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నామన్నారు. ముఖ్యంగా తప్పనిసరి పరిస్థితుల్లో గోడ దూకి బయటకు వెళ్తున్నామని విద్యార్థులు తెలిపారు. అలాగే పాఠశాల ఆవరణలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా గదుల్లో విద్యార్థుల వస్తువులు మాయం అవుతున్నాయని విద్యార్థులు తెలిపారు. విద్యతో పాటు క్రమశిక్షణను ఉపాధ్యాయులు విద్యార్థుల నడవడికను పరిశీలించడంలో విఫలం అయ్యారని తెలుస్తుంది. జూనియర్ విద్యార్థుల నుంచి సీనియర్ విద్యార్థులు ఉదయం పూట గుడ్లను తీసుకుంటున్నారని జూనియర్ విద్యార్థులు తెలిపారు. గురుకులంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నమని, ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గ్రాంట్లు లేక

గురుకులానికి గ్రాంట్లు లేక కొన్ని పనులు చేపట్ట లేక పోతున్నాం. గురుకులంలో రన్నింగ్ పైప్‌లైన్లు లేక బాత్రూంలకు నీరు సరఫరా కావడం లేదు. బాత్రూంల్లో నీటి సదుపాయం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- దేవేందర్, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల, కొల్లివలస


గురుకులం ఆవరణలో స్వైర విహారం చేస్తున్న కుక్కలు

నేటి నుంచి పాఠశాలల సముదాయాలు

టెక్కలి : విద్యాశాఖ ఆధ్వర్యాన ప్రతినెలా నిర్వహిస్తున్న పాఠశాలల సముదాయాలు మంగళవారం నుంచి రెండు రోజులు నిర్వహించనున్నారు. మొదటి రోజు తెలుగు, గణితం, జీవశాస్త్రం సబ్జెక్టులకు సముదాయాలు నిర్వహిస్తారు. రెండో రోజు బుధవారం సాంఘికశాస్త్రం, భౌతికశాస్త్రం, హిందీ, ఆంగ్లం సబ్జెక్టులకు పాఠశాలల సముదాయాలు నిర్వహించనున్నారు. సముదాయాల హెచ్‌ఎంలు పూర్తిస్థాయి అధికారులుగా వ్యవహరిస్తారు.

వికసించిన బ్రహ్మ కమలం

పలాస : పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీలో నేతాజీ నగర్‌లో షణ్ముఖరావు, సోమేశ్వరి దంపతుల ఇంట్లో బ్రహ్మ కమలం వికసించింది. చూడడానికి ఎంతో చక్కగా నక్షత్ర అకారంలో సువాసనతో వెదజల్లుతుంది.

ఆకట్టుకున్న సంగీత విభావరి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శ్రీకాకుళం మ్యూజిక్ అండ్ అకాడమి, మావుదూరు మ్యూజిక్ అకాడమీ సంయుక్తంగా సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకులు వివిధ సినీ నేపథ్యగానంతో పాటు మధుర గీతాలను ఆలపించారు. అనంతరం డిటిపి డిజైనర్ పందిరి గోవిందరాజులను సత్కరించారు. కార్యక్రమంలో అకాడమీ ప్రెసిడెంట్ జె.వెంకటేశ్వరరావు, పి.మాలతి, మావుదూరు సత్యన్నారాయణ శర్మ, బందారు చిట్టిబాబు, శ్రీను, హరి సత్యన్నారాయణ, రామచంద్రదేవ్, మండ శ్రీనివాసరావు, సుసరపు లక్ష్మీగణపతి శర్మ తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొత్తూరు : కొత్తూరుకు చెందిన వైసిపి నాయకులు టొంపల గోపి కొద్ది రోజులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈమె వెంట ఎంపిటిసి వి.లక్ష్మీనారాయణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ బాలకృష్ణ, ఆనందరావు, వి.శ్రీను, పి.దాసునాయుడు ఉన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

నిరుపేద కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ప్రగడపుట్టుగకు చెందిన బతకల అప్పారావు ఉపాధి కోసం హైదరాబాద్ వలస వెళ్లి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో ఓ ప్రయివేటు ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్నాడు. అయితే ఆపరేషన్ వికటించడమే కాకుండా పచ్చకామెర్ల సోకడంతో తక్షణమే మరో ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నిరుపేద కుటుంబం కావడంతో దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. సమాచారం తెలుసుకున్న స్థానిక డాక్టర్ అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు స్పందించి చేయూత అందించారు. సోమవారం అప్పారావు భార్యకు రూ.13 వేలు ఆర్థికసాయం అందించారు.

అరకభద్ర వంతెన పనులు పరిశీలన

ఇచ్ఛాపురం: మండలంలోని అరకభద్ర బాహుదా నది వంతెన నిర్మాణ పనులను సీడాప్ మాజీ చైర్మన్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. వంతెన ఇరువైపులా అప్రోచ్ రోడ్ నిర్మాణం చేయకుండా రోడ్డు వేస్తున్న పరిస్థితిని పరిశీలించారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయకపోతే వరదలు వస్తే నీటి ప్రవాహానికి మట్టి కొట్టుకుపోయి వంతెనకు ఇరువైపులా రోడ్డు పూర్తిగా పాడయ్యే ప్రమాదం ఉందన్నారు. నిర్మాణంలో మట్టిని తగినంతగా రామింగ్ చేయకుండా రోడ్డు పనులు చేపట్టడంతో పగుళ్లు ఏర్పడ్డాయని అన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో వంతె వంతెన దెబ్బతినే అవకాశం ఉంటుందన్నారు. అధికారులు దృష్టికి సారించి వంతెన నిర్మాణంలో లోపాలను సరిదిద్దే చర్యలు చేపట్టాలన్నారు.


పగుళ్లను పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి


ఆమదాలవలస : ముస్లిం సోదరులతో ఎమ్మెల్యే రవికుమార్

పండగలు మతసామరస్య ప్రతీకలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

దేశంలో వివిధ మతాలకు చెందిన ప్రజలు జరుపుకొనే పండగలు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని నూరాన్ మసీదులో నిర్వహించిన మిలాన్ ఉన్ నబీ కార్యక్రమంలో పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూరాన్ మసీదు ముందు భాగంలో ఉన్న వరండాలో మైనార్టీ విభాగ నిధులతో పక్కా కాంక్రీట్ శ్లాబ్ వేయిస్తానని, కంద్రపేట సమీపంలో ముస్లింల శ్మశాన వాటికకు ప్రహరీ గోడ నిర్మించడానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు జిలాని మాలిక్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నగరంలో శాంతి ర్యాలీ

శ్రీకాకుళం అర్బన్: మిలాన్ ఉన్ నబీ సందర్భంగా ముస్లింలు నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. జామియా మసీదు నుంచి ఏడురోడ్ల కూడలి, డే అండ్ నైట్ నుంచి రైతు బజార్ మీదుగా జామియా మసీదు వరకు సాగింది. కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ అధ్యక్షులు మహిబుల్లా ఖాన్, ఉపాధ్యక్షులు హాజీ భయ్యా, సెక్రటరీ అక్బర్ బాషా, జాయింట్ సెక్రటరీ షకూర్ ఖాన్, ట్రెజరర్ ఉస్మాన్, సభ్యులు సయ్యద్ షఫీ, మతాబ్ ఖాన్, గుత్తి రఫీ, అబ్దుల్, కరీం, ఇర్ఫాన్ భాషా, గౌరవ అధ్యక్షులు హాజీ అమిరుల్లా బేగ్ తదితరులున్నారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో మిలాద్ ఉన్ నబీని హజ్రత్ యూసుఫ్-షా-తకియా-దర్గాలో మహమ్మద్ పవిత్ర పాద-ముద్రని బయట ప్రజల సందర్శనార్థం హజ్రత్ యూసుఫ్ తకియా డెవలప్‌మెంట్ కమిటీ ప్రెసిడెంట్ అబ్దుల్లా సభ్యులతో నిర్వహించారు. లాలపేట మసీదు నుంచి ముస్లిములు ర్యాలీ నిర్వహించారు. రెండు మసీదుల నుంచి వేర్వేరుగా ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు జోహార్ ఖాన్, మస్తాన్ షరీఫ్, ఎం.డి.పర్వేజ్, కస్బా అలీమ్ ఖాన్, ఎం.డి. మన్నన్, ఎం.డి. ఉస్మాన్, ఎం.డి.లతీఫ్, ఎం.డి.హసునుద్దీన్, ఎం.ఎం. ఇర్ఫాన్, అహమద్, ఖాదర్‌ఖాన్, జకీర్ షరీఫ్ పాల్గొన్నారు.

ముస్లిములకు 'స్వర్ణ భారతి' స్వాగతం

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిములు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ భారతి విద్యాసంస్థల వద్దకు చేరుకోగానే వారికి చాట్ల తులసీదాస్‌రెడ్డి ఆతిథ్యం ఇచ్చారు. మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చాట్ల లోహిదాస్‌రెడ్డి, ఆశ గౌరీ శంకర్‌రెడ్డి, బర్ల ప్రకాష్‌రెడ్డి, ధర్మరాజు, కొచ్చర్ల లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలో మెళియాపుట్టి, పట్టుపురం గ్రామాల్లో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిములు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ సిలార్, టిడిపి మండల మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, షేక్ షాయిద్, షేక్ సాంద్, ఇబ్రహీం, షేక్ మహమ్మద్ నవాజ్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి అభినందనలు

పాతపట్నం : పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఆసియా పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా కేంద్రమంత్రి పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును శ్రీకాకుళంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. చిన్న వయస్సులోనే దేశ స్థాయిలో పేరు ప్రాఖ్యాతలు పొందినందుకు అభినందనలు తెలిపారు. ఈయన వెంట సీది సర్పంచ్, టిడిపి నాయకులు ఉన్నారు.

కోటబొమ్మాళి: ఇటీవల ప్రపంచదేశాలతో జరిగిన సమావేశంలో కేంద్ర పౌర విమానయశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ఆసియ పెసిఫిక్ కాన్ఫరెన్స్‌కి చైర్మన్‌గా నియమితులయ్యారు. దీంతో జిల్లా కేంద్రంలోని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, ఆయన తనయుడు బోయిన సత్యశ్రీనివాస్‌లు మర్యాదపుర్వకంగా సోమవారం కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు మాట్లాడారు. ముఖ్యంగా కళింగ కోమటిలను త్వరగా ఒబిసిలో చేర్చవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

ఇచ్ఛాపురం: ఆసియా పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ చైర్మన్‌గా ఎన్నికైన రామ్మోహన్ నాయుడును జిల్లా కేంద్రంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.


పాతపట్నం : కేంద్రమంత్రితో ఎమ్మెల్యే గోవిందరావు

మహిళా ఉత్పత్తులు ఒఎన్‌డిసిలో నమోదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా సంఘాలు తమ ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల కోసం పొందిన రుణాల ద్వారా చేపడుతున్న ఉత్పత్తులన్నింటినీ చక్కగా మార్కెటింగ్ చేసుకోవడానికి ప్రభుత్వం నూతనంగా ఒఎన్‌డిసి (ఆన్‌లైన్ డిజిటల్ కామర్స్) విధానం అమల్లోకి తెచ్చినట్లు వెలుగు ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. సోమవారం పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘసభ్యులు తమ సొంత నిధులను పూర్తిగా వినియోగించుకొని, మండల సమాఖ్య, గ్రామ సంఘాల ద్వారా ఏర్పాటు చేసుకుంటున్న చిన్న, మధ్యతరగతి, కుటీర పరిశ్రమలకు అవసరం మేరకు స్త్రీనిధి రుణాలను పొందవచ్చని తెలిపారు. మహిళలు తయారు చేస్తున్న ఆహార ఉత్పత్తులకు మంచి ప్యాకింగ్, బ్రాండింగ్‌తో మీ సంస్థను మీ లోగోతో సహ రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఆన్‌లైన్ మార్కెటింగ్ విధానాన్ని వినియోగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమన్వయకర్త రామప్పడు, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు పాల్గొన్నారు.


ఆస్పత్రి వీధిలో లడ్డూ వేలం పాటలో పాల్గొన్న కమిటీ సభ్యులు

పలుచోట్ల లడ్డూ వేలంపాట

పొందూరు: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక మండపాల వద్ద లడ్డూ వేలం పాటలు నిర్వహించగా మండల కేంద్రంలోని గాంధీనగర్ వీధిలో ఎరుకలపేటకు చిగులపల్లి సురేష్ రూ. 24,399కు దక్కించుకున్నారు. కళాంజలి సెంటర్‌లోని ఆస్పత్రి వీధిలో లడ్డూను దండా వెంకటరావు రూ.18 వేలుకు కైవసం చేసుకున్నారు. అలాగే రాపాకలో వేలంలో గ్రామానికి చెందిన అయ్యప్పగారి ధర్మారావు రూ.7,900 లకు దక్కించుకున్నాడు.

ఎక్కడ చూసినా చెత్తే

ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు

పలాస: ఎక్కడ చూసినా చెత్తతో మున్సిపాలిటీ నిండి పోయింది. కాలువల్లో మురుగు నీటితో పేరుకుపోయింది. ఎక్కడ చూసినా కంపు కొడుతుంది. పారిశుధ్యం మెరుగు పరచాలని ఎమ్మెల్యే గౌతు శిరీష మున్సిపల్ అధికారులకు హెచ్చరిస్తున్నా పనితీరులో మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏ వార్డుకు వెళ్లి చూసినా చెత్త కుప్పలే తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలోని 31 వార్డుల్లో సుమారు 60 వేలు పైగా జనాభా నివసిస్తున్నారు. రోజుకు సుమారు 18 టన్నుల చెత్త వస్తున్నట్లు అంచనా.

మున్సిపాలిటీలో 10 మంది రెగ్యులర్, 79 మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారు. మున్సిపాలిటీలో నిత్యం ఇంత మంది పనిచేసినా ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయే పరిస్థితి. అటువంటి పరిస్థితుల్లో మున్సిపాలిటీలో పారిశుధ్యం మరింత అధ్వానంగా తయారైంది. అందుకు ఉదాహరణ కాశీబుగ్గ రోటరీ నగర్, శ్రీనివాస్ నగర్, ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో చెత్తా చెదారం పేరుకుపోయింది.


పేరుకుపోయిన చెత్తా చెదారం

రోగాల బారిన పట్టణ ప్రజలు

పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలోని వార్డులు వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోవడతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడెక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లు తుందని, దోమలు విపరీతంగా పెరిగి రాత్రి కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయని మున్సిపాలిటీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాశీబుగ్గ సాయికాలనీ, రోటరీ నగర్, ఎల్లమ్మ ఆలయం సమీపం, కాపువీధి తదితర ప్రాంతాల్లో చెత్తచెదారం పేరుకుపోయింది. సుమారు పది రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడం, చెత్త చెదారం పేరుకు పోవడంతో పట్టణ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. జబ్బు జ్వరాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చొరవ చూపి పారిశుధ్యం పనులు చేపట్టాలని కోరుతున్నారు.

రైలు ప్రమాదంలో యువకుడు మృతి


సింహాద్రి (ఫైల్)

మెళియాపుట్టి: మండలంలోని పెద్దలక్ష్మీపురానికి చెందిన యువకుడు మడపాల సింహాద్రి (35) ఆదివారం సాయంత్రం ఇచ్ఛాపురం వద్ద రైలు ప్రమాదంలో మృతి చెందాడు. ఇచ్ఛాపురం ప్రాంతంలో రెండేళ్లుగా పెయింటింగ్ పనులు చేస్తూ జీవనాధారం సాగిస్తున్నాడు. తల్లి కొన్నేళ్లు కిందట మృతి చెందారు. తండ్రి లక్ష్మణ హైదరాబాద్‌లో వలస కూలీగా ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. దీంతో పెద్దలక్ష్మీపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

శివాజీనగర్‌లో చోరీ


బాధితురాలు కృష్ణవేణి

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శివాజీ నగర్ రెండో వీధి, శిరిడి ఆలయం వెనుక వీధిలో నివాసం ఉంటున్న పెంట విష్ణుమూర్తి ఇట్లో పట్ట పగలు చోరీ జరిగింది. సోమ వారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆగం తకుడు ఇంట్లోకి చొరబడి చోరికి పాల్పడి ఐదు తరుణాల బంగారు ఆభరణాలను అపహరించుకు పోయారు. బాధితురాలు కథనం మేరకు పెంట కృష్ణవేణి భర్త విష్ణుమూర్తికి టీ అందించి తను నిర్వహిస్తున్న కిరాణా షాపుకు పంపించింది. అనంతరం ఆమె తన బయట మెట్లపై కూర్చొని టీ తాగుతుంది. అగంతకుడు ముఖానికి రుమాలు కొట్టుకొని వచ్చిన తాగడానికి మంచినీరు కావాలని కోరారు. దీంతో ఆమె ఇంటి లోపకు వెళ్లి వెళ్లింది. ఆమె వెనకే ఆగంతుడు ఇంట్లోకి చొరబడి కత్తి చూపించి చంపుతానని బెదిరించి ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడు, మరో చేయను దోచు కున్నాడు. గాజులు కూడా తీసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాజులు టైట్‌గా ఉన్నాయని చెప్పడంతో ఆమెను వెనక్కి నెట్టేసి పక్కన ఉన్న ముళ్లపొదలు నుంచి మరొక వీధికి పరుగు లెత్తాడు. అనంతరం ఆమె వీధిలోకి వచ్చి కేకలు వేసింది. వీధి ప్రజలు అన్నిచోట్లా వెతికారు. ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చేసుకుని ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉన్న సిసి కెమెరాలు పరిశీలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో బాలునికి గాయాలు


కుక్కల దాడిలో గాయాలు

టెక్కలి రూరల్ : టెక్కలి మేజరు పంచాయతీ పరిధిలోని కోదండ రామవీధి సమీపంలో సోమవారం కుక్కలు స్వైరవిహారం చేశాయి. వీధిలో సైకిల్ తొక్కుతున్న సాయి కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు చూసి కుక్కలను వెంట బెట్టడంతో సాయి ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. బాలుడిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. గత కొంత కాలంగా టెక్కలిలో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడి చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఈ-పంట నమోదుకు గడువు పొడిగింపు

ఇచ్ఛాపురం : ఖరీఫ్ సీజన్ పంటలకు ఈ-పంట నమోదు గడువును ప్రభుత్వం పొడిగించిందని మండల ఎఒ భార్గవి తెలిపారు. ఈ పంట నమోదుకు ఈనెల 15 వరకు గడువు విధించగా, తాజాగా ఈ నెల 23 వరకు ప్రభుత్వం పెంచిందన్నారు. పంట నమోదు, ఇకెవైసి తమ గ్రామంలోని రైతు సేవ కేంద్రాలకు వెళ్లి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

పదెకరాల్లో బహుళ పంటల సాగు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పదెకరాల్లో ఎ- గ్రేడ్ మోడల్ కాంపాక్ట్ బ్లాక్‌లో బహుళ పంటలను సాగు చేయిస్తున్నట్టు డిజిటల్ ఎల్‌టు సురేష్ తెలిపారు. సోమవారం మండలంలోని నిమ్మతొర్లాడలో సురేష్ మాట్లాడుతూ డిపిఎం రేవతి ఆదేశాల మేరకు రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో అదనపు ఆదాయం వచ్చేలా పలురకాల పంటలు సాగు విధానాలను క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులతో ఎ గ్రేడ్ మోడల్ పద్ధతిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా వరి పంటలో అదనపు ఆదాయం వచ్చే పద్ధతిని ఎ గ్రేడ్ మోడల్ అంటారని, ఈ మోడల్‌లో రైతుకు వరి పంటతో పాటు పొలం గట్లుపై వేసుకున్న కూరగాయల బహుళ పంటల సాగులో అదనపు ఆదాయం వస్తుందన్నారు. చేపెనపేటలో పదిమంది రైతులు పది ఎకరాల విస్తీర్ణంలో ఎ గ్రేడ్ మోడల్ పద్ధతిలో సాగు చేస్తూన్నారన్నారు. ప్రస్తుతం రైతులకు కూరగాయలు సమకూరుతున్నాయని, ప్రతిరోజు ఇంటి అవసరాలకు సరిపోయే కూరగాయలు లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఏచూరి మృతికి సంతాపం

ప్రజాశక్తి- పర్లాకిమిడి

కమ్యూనిస్టు ఉద్యమంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెరగని ముద్ర వేశారని ఆల్ ఇండియా ఫోరం బ్లాక్ జిల్లా కార్యదర్శి పైల మురళీకృష్ణ, పర్లాకిమిడి జిల్లా కార్యదర్శి జొన్న సుభాష్ చంద్రరావు అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ సోమవారం నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఏచూరి విద్యార్థి దశ నుంచే ఉద్యమానికి నాయకత్వం వహించి అంచెలంచెలుగా సిపిఎం జాతీయస్థాయి నాయకుడిగా ఎదిగారని అన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా సిపిఎం నాయకులు సూరయ్య, ప్రజాశక్తి సర్క్యులేషన్ ఎగ్జిక్యూటివ్ బి.సింహాచలం, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.బంగారి, మోహిత్ మిషల్, మనష్ జెన, సుగ్యని గోమాంగో, ముండూరు శేఖర్‌రావు, ఎలియజర్, కిషోర్‌నాయక్ పాల్గొన్నారు. అలాగే సిఎంసి కార్యాలయంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి దొండపాణి రైతో, ముచ్చి బంగారు, గోకుల బెహరా, మీశాల్, మానస జన్నా, శ్రీను బెహరా, జొన్న సుభాష్, పైలా మురళి తదితరులు పాల్గొన్నారు.